
ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గ దర్శకాల మేరకు రోజువారి తనిఖీల్లో భాగంగా శనివారం కనుపర్తి పాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూములను సీసీటీవీ ల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ సెదు మాధవన్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్, అదనపు ఎస్.పి సౌజన్య,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ అంతా అతుకుల బొంత..!

-ఎప్పుడో వెనక్కి వెళ్లిన ఆస్పత్రులు
-ఇప్పుడు బిల్లులందక సేవల నుంచి దూరం
-సామాన్యుడికి ఇబ్బందులు..!

పేద ప్రజలకు ఆరోగ్య భరోసా ఇస్తున్న ఆరోగ్యశ్రీ పథకం రోజు రోజుకు వెను కబడుతోంది..ప్రభుత్వం మాటలు కోటలు దాటుతుంటే.. ఆచరణ మాత్రం గడప తాటడం లేదు.. ఎన్నికల వేళ ఆరోగ్య శ్రీ ఆస్పత్రులు సేవల నుంచి వెనక్కి వెళ్లాయి. పేదలకు వెయ్యి రూపాయల బిల్లు దాటితే ఆరోగ్యశ్రీ కింద చూస్తామని నిన్నటి వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ నిధులు సక్రమంగా అందకపోవడంతో జిల్లాలో ఎప్పుడో కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ నుంచి వెళ్లిపోయాయి. ఇప్పుడు అక్కడక్కడా ఉన్న ఆసుపత్రులు సేవలు నిలుపుదల చేశాయి. 2007లో పేద ప్రజలకు భరోసా కల్పించిన ఈ పథకం ఎందుకూ కొరకావడం లేదు. ఈ పథకం అమలు నుంచి కార్పొరేట్ ఆసుపత్రులు బిల్లులు రావడం లేదని వెళ్లిపోయాయి. ఉన్న ఆసుపత్రుల పూర్తి స్థాయిలో సేవలు అందించడానికి ముందుకు రావడం లేదు. నగదు సరిపోవడం లేదని, నగదు సరిగా రావడం లేదని పలు రకాల సేవలను నిలిపేశాయి. మూడ్రోజుల నుంచి మిగిలిన ఆస్పత్రులు సేవలు చేయడం లేదు. 3,257 సేవలందిస్తున్నామనే గొప్పలు తప్ప పెద్దగా ఉపయోగపడడం లేదు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నిరుపేద ప్రజలకు మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఉచితంగా బిపిఎల్ కింద ఉన్న పేదలకు, తెల్లరేషన్‌కార్డుదారులకు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్, ఇహెచ్‌ఎస్ స్కీమ్‌ల ద్వార సేవలందించారు. అప్పట్లో ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం కింద చేపట్టారు. రాష్ట్ర వ్యాపితంగా ఏడాదికి రూ.3,500 కోట్లు ఈ పథకం కోసం ఖర్చుచేస్తే, జిల్లాలో సుమారు రూ.350 నుంచి రూ.400 కోట్లు ఖర్చుచేసేవారు. నగరంలోని ప్రముఖ ఆసుపత్రులు ఈ పథకాన్ని అమలు చేశాయి. బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సింహపురి, నారాయణ ఆసుపత్రి, అపోలో సూపర్ స్పెషాలిటీ వంటి కార్పొరేట్ ఆసుపత్రులతోపాటు, నగరంలోని అనేక ఆసుపత్రులు ఈ స్కీమ్ ద్వార సేవలు అందించాయి. నిధులు అటు, ఇటుగా విడుదల అయినప్పకీ సేవలందించారు. ఇటీవల కాలంలో వైద్యసేవల సంఖ్య భారీగా పెంచారు. ఆసుపత్రులకు ఆపరేషన్లకు అతి తక్కువ నగదు మంజూరు చేయడం, అది కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో నగరంలోని ప్రముఖ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నుంచి వెళ్లిపోయాయి. అపోలో, బొల్లినేని తోపాటు పలు ఆసుపత్రుల ఈ సేవల నుంచి ఎప్పుడో తప్పుకున్నాయి. నారాయణ ఆసుపత్రి, మెడికోవర్ కార్పొరేట్ ఆసుప్రతులు మాత్రమే ఆరోగ్యశ్రీ కింద సేవలం దిస్తున్నారు. స్థానిక ఆసుపత్రులు కొన్ని మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ విషయంలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఉచిత సేవలని వెళుతోన్న రోగులకు వివిధ రకాల కారణాలు చెప్పి బిల్లులు వసూళ్లు చేస్తున్నారు.

ఆరోగ్య శ్రీ అతుకుల బొంత..!

ఆరోగ్యశ్రీ పథకం ప్రభుత్వ విధానాల వల్ల నత్తనడక నడుస్తోంది. గతంలో ఈ పథకం కింద 2,446 జబ్బులను చేర్చారు. ఆయా విభాగాలకు చికిత్స చేస్తే, నగదు ఇంతే చెల్లిస్తామని ప్రకటించారు. అటు, ఇటుగా నిధులు మంజూరు చేసే పరిస్థితులుండేవి. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ విషయంలో ఆర్భాటం చేశారు. వెయ్యి రూపాయల బిల్లు తరువాత అన్ని కేసులను ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేస్తామని గొప్పలు చెప్పారు. అప్పటికే ఉన్న 2446 జబ్బులకు 811 కలిపి మొత్తం 3,257 జబ్బులను ఆరోగ్య శ్రీ కింద చేర్చారు. ఈ నిర్ణయంతో పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటలేదు. అప్పటికే ఆరోగ్యశ్రీ కింద జిల్లాలో సేవలందిస్తున్న ఆసుపత్రులు మేం చేయలేమంటూ వెళ్లిపోయాయి. నెల్లూరులో నారాయణ ఆసుపత్రి ఒక్కటే ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ఆసుపత్రిగా కొనసాగుతోంది. మెడికోవర్ కూడా ఆరోగ్యశ్రీ సేవలు చేస్తుంది. ప్రభుత్వం చెబుతోన్న జబ్బులకు ఆసుపత్రులు చికిత్స చేయడం లేదు. ఆరోగ్యశ్రీ స్కీమ్ నుంచి కొన్ని ఆసుపత్రులు వెళ్లిపోగా, ఉన్న ఆస పత్రులు ముఖ్యమైన సేవల నుంచి తప్పుకుం టున్నాయి. నగరంలోని మెడికోవర్ ఆసుపత్రిలో యూరాలజీతో పాటు పలు సేవలను నిలిపేశారు. ప్రభుత్వం చెబుతున్న దానికి ఇక్కడ అమలు జరుగుతోన్న పరిస్థితులకు సామాన్య ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. అప్పులు చేసుకొని ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలందు కుంటు న్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ విషయంలో చొరవ చూపించి, రోగులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత..?

రాష్ట్ర వ్యాపితంగా ఆరోగ్యశ్రీ ఆస్పత్రి సేవలను మూడ్రోజుల నుంచి నిలుపుదల చేశారు. ప్రభుత్వం నుంచి ఇప్పటికే భారీగా బిల్లులు రావాల్సి ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఇప్పట్లో బిల్లులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వచ్చే నెల 4న కొత్త ప్రభుత్వం ఏర్పాట్లు జరగనుంది. ఈ ప్రభుత్వమన్నా బిల్లులు ఇస్తుందో లేదో అన్నట్లు మూడ్రోజుల నుంచి సేవలు నిలుపుదల చేశారు. ఒకటో, రెండు ఆసుపత్రులు మాత్రమే సేవలు చేస్తున్నాయి. రోగులు ప్రయివేటు ఆసుపత్రుల్లో చూపించు కోవాల్సి వస్తుంది. సాధారణ రోజుల్లోనే ఆరోగ్యశ్రీ సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇప్పుడు సమ్మె చేస్తుండడంతో రోగులు బాధలు వర్ణణాతీతం.

కౌంటింగ్ ప్రక్రియపై నిఘా నేత్రం

మూడంచెల పటిష్ట బందోబస్తు - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజాశక్తి-నెల్లూరు :భారత ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు జూన్ 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిఘా నీడలో జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఓ ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 130 నుంచి 140 సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు రంగం సిద్ధం చేశామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ కౌంటిం గ్‌నకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నా మన్నారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో సుమారు వెయ్యి మంది సిబ్బందిని కౌంటింగ్ విధులకు కేటాయించామన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కనుపర్తి పాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది అందరూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, 8.30 గంటలకు ఈవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఈవిఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. అత్యధికంగా కోవూరు నియోజకవర్గంలో 324 పోలింగ్ బూత్‌లు, అత్యల్పంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో 248 పోలింగ్ బూత్‌లున్నాయన్నారు. ఇప్పటికే ఆర్వోలు, ఏఆర్ఓలకు ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చామన్నారు. సిబ్బందికి సైతం శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి నలుగురు అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమిం చిందన్నారు. అబ్జర్వర్ల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. అబ్జర్వర్ సంతకం చేసిన తర్వాత మాత్రమే రౌండ్ల వారీగా ఫలితాలను ప్రకటిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంపై డ్రోన్లు ఎగరకుండా రెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా, ప్రశాంత వాతావరణంలో ఫలితాలు వెల్లడించేందుకు రాష్ట్ర, ఆర్మ్‌డ్, సిఆర్‌పిఎఫ్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇటీవల పోలింగ్ సమయంలో గొడవలు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

ప్రశాంతంగా ఎపిపిఎస్‌సి పరీక్ష

62.61 శాతం హాజరు

ప్రజాశక్తి -నెల్లూరు

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఎపిపిఎస్‌సి శనివారం నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఆన్లైన్ పద్ధతిలో జరిగిన ఈ పరీక్ష కావలిలో పిబిఆర్ విశ్వదయ ఇంజనీరింగ్ కాలేజీ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో, కోవూరులోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, ముత్తుకూరు రోడ్ లోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, పొట్టెపాలెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాల్లో నిర్వమించారు. పరీక్షకు 1070 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 670 మంది హాజరయ్యారు. 400 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 62.61 శాతం మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పరీక్ష కేంద్రాల్లో ఆర్ఐఒ తనిఖీ

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్, సప్లిమెంటరీ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎవరైనా మాస్ కాపింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్ఐఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. వివిధ పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పరీక్షలకు మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 9635 మందికి గాను 9214 మంది విద్యార్థులు హాజరు కాగా 421 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఒకేషనల్ విద్యా ర్థులు 271 మందికి గాను 238 మంది విద్యార్థులు హాజరు కాగా, 33 మంది విద్యార్థులు హాజరు కాలేదు.మధ్యాహ్నం రెండో సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండో సంవత్సరం జనరల్ విద్యార్థులు 433 మందికి గానూ 386 మంది విద్యార్థు లు హాజరు కాగా 47 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 113 మందికి గాను 99 మంది విద్యార్థులు హాజరు కాగా 14 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఆర్ఐఒ, డివి ఈవో, డిఇసి, స్క్వాడ్ కలిసి 41 సెంటర్లను తనిఖీ చేశారు.



పరీక్ష కేంద్రాలలో తనిఖీలు చేస్తున్న ఆర్ఐఒ



గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థులకు వేసవి శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు

వేసవి శిక్షణా తరగతుల సందర్భంగా కందుకూరు శాఖ గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ముందుగా నీతి కథలు చదివి వినిపించారు. చుండి నాగేశ్వరరావు విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. గ్రంథాలయం సిబ్బంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులు కార్యక్రమాన్ని విని యోగించుకోవాలని వివరించారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత దృశ్యం

కొనసాగుతున్న సర్వీసు ఓట్ల నమోదు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన సర్వీస్ ఓట్ల పోలింగ్‌లో భాగంగా శనివారం సర్వీస్ ఓట్లు పోస్టల్ ద్వారా వచ్చాయి. పోస్ట్ ద్వారా అందుకున్న సర్వీసు ఓట్లను ఎన్నికల అధికారులు సురక్షితంగా కందుకూరు ఆర్‌డిఒ ఆఫీస్ లోని రికార్డు గదిలోని స్ట్రాంగ్ రూములోనికి చేర్చి రాజకీయ పార్టీల ఎన్నికల స్విప్ ఏజెంట్లు సమక్షంలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూముకు సీల్ వేశారు. డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదు, ముప్పవరపు కిషోర్, ముచ్చు శ్రీనివాసులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

'దామా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేక్ ను దామా మల్లేశ్వరరావు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొని మల్లేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కందుకూరులో పందేలు జోరు ..

ఫలితాలపై టిడిపి, వైసిపి శేణుల్లో ఉత్కంఠ

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గం టిడిపి అభిమానులు గెలుపు పందేలు కట్టేందుకు దూకుడు ప్రదర్శిస్తున్నారు. వైసిపి మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. కందుకూరు శాసనసభ నియోజకవర్గ ఎన్నికల బరిలో దాదాపు 23 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ కూటమి అభ్యర్థిగా టిడిపి తరపున పోటీ చేసిన ఇంటూరి నాగేశ్వరరావు వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన బుర్రా మధుసూదన్ యాదవ్ మధ్య కొనసాగింది. ఈనెల 13 పోలింగ్ జరిగిన తర్వాత రెండు మూడు రోజుల వరకు గెలుపుపై ఇరుపార్టీలవారు ధీమా వ్యక్తం చేశాయి." గెలుపుపై తెలుగుదేశం శ్రేణులు పందేలు కట్టేందుకు దూకుడుగా వ్యవహరించారు. వైసిపి వారు వెనక్కి తగ్గటం ప్రారంభమైంది. కందుకూరు ఎంఎల్ఎ గెలుపుపై దాదాపు వైసిపి పందేలకు ఏమాత్రం ఆసక్తి చూపటం లేదు. రాష్ట్రంలో వైసిపి అధికారం తిరిగి చేపడుతుందని, పందేలు వేయడానికి సిద్ధమయ్యారు. పందాలు సమానంగా వేయకుండా వైసిపి అధికారంలోకి వస్తుందని, ఒక్క రూపాయి పెడితే కూటమి అధికారంలోకి వస్తుందని ఒకటిన్నర రూపాయి పెట్టే విధంగా పంద్యాలు వేశారు. ఆ పందాలు కూడా ఒకటి రెండు రోజులు మాత్రమే సాగాయి. టిడిపి దూకుడును అందిపుచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో వైసిపి శనివారం నుంచి తన వైఖరి మార్చుకుని రూపాయి మేము పెడతాం మీరు ఒక్క రూపాయి 70 పైసలు వంతున పెట్టాలని షరతులు పెట్టింది. అందుకు కూడా తెలుగుదేశం శ్రేణులు పందాలు పెట్టడానికి సిద్ధమయ్యారు. అరకొరగా పెట్టేరే గానీ దూకుడుగా వైసిపి శ్రేణులు ముందుకు రాలేదు. 2019 ఎన్నికల్లో వైసిపి శ్రేణులు తెలుగుదేశం పార్టీ అభిమానుల నుంచి రకరకాల రూపాలలో పందేలు పెట్టించి డబ్బులు కైవసం చేసుకున్నారు. ఎలాంటి పందెం పెట్టిన తెలుగుదేశం అభిమానులు గెలవలేకపోయారు. 2019 ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం గెలుపు పై పందేలు పెట్టి అప్పులు పాలైన పరిస్థితి ఏర్పడింది. కోట్లాది రూపాయలు పోగొటుకున్నారు. ఆనాడు పోగొట్టుకున్న డబ్బులు ఈసారి ఎలాగైనా తిరిగి గెలుచుకోవాలని ఆశతో టిడిపి శ్రేణులు ప్రయత్నిస్తుండగా వైసిపి శ్రేణులు ముందుకు రాని పరిస్థితి కందుకూరు నియోజకవర్గంలో ఉంది. ప్రభుత్వ ఏర్పాటుపై పందాల పరిస్థితి ఇలా ఉంటే తెలుగుదేశం అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలుస్తాడని పందాలు కట్టేందుకు పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు ఆసక్తి చూపుతున్నారు. ఎంతైనా పెట్టడానికి సిద్ధమవుతున్నారు. వైసిపి నియోజకవర్గ గెలుపు ఓటమిపై పందాలకు ఆసక్తి చూపటం లేదు. వైసిపి గెలుస్తుందని పందెం కట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. మండలాల్లో మెజారిటీపై కూడా పందేలకు తెలుగుదేశం కాలు దువ్వుతోంది. చినా,, చితక పద్యాలు తప్ప లక్షల్లో ఎవరు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపుపై పెట్టడం లేదు. కందుకూరులో వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ గెలుపు ఖాయమని, ఎవరైనా అంటే వెంటనే గెలవడని మేము పందెం పెడతాం 'మీరు సిద్ధమా అని టిడిపివారు అంటున్నారు. ఈ నేపథ్యంలో . గెలుపు ఎవరిని వరిస్తుందో గానీ ఇరుపార్టీల కార్యకర్తల మధ్య ఉత్కంఠ కొనసాగుతుంది.



పలుచోట్ల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-నెల్లూరు

సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం పటిష్టంగా నిర్వహించారని, ఈ క్రమంలో సరైన పత్రాలు లేని 80 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు ఎస్‌పి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అణచివేత, దొంగతనాల నివారణ, అసాంఘీక శక్తుల ఏరివేతే కార్డన్ సర్చ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శనివారం బాలాజీ నగర్, రూరల్ స్టేషన్, సంగం, ఏ. సాగరం, సోమశిల, ఉదయగిరి, దుత్తలూరు, వికె. పాడు, కలువాయి, బిట్రగుంట, జలదంకి, రాపూరు, కలిగిరి పరిధిలలో కార్డన్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ, స్పెషల్ పార్టీలతో సంబందిత పోలీసు స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా కలిపి ఆపరేషన్ నిర్వహించ మన్నారు. సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచటానికి ఈ కార్డన్ సర్చ్ ఆపరేషన్ ఈ ఆపరేషన్ లక్ష్యమని, అదే సమయంలో పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసు కోవడం సులభతర మౌతుం దన్నారు. చోరీ సొత్తు, అను మానంగా ఉన్న రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుస్తకాల మాఫియాపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో ప్రయివేట్ ,కో ఆపరేటీవ్ విద్యాసంస్థలు యథేచ్ఛగా పుస్తకాలు ముద్రిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నాయని అటువంటి పుస్తకాల మాఫియాపై జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్నార న్నారు. అంతే కాకుండా తమ పాఠశాలల్లో, కళాశాలల్లో చేరే విద్యార్థులు తమ వద్దనే పుస్తకాలు కొనుగోలు చేయాలని షరతులు విధించడం దారుణమన్నారు. ఈ వ్యవహారం విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా , వారు గుర్తించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో విద్యా శాఖ అధికారులు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల పుస్తకాల దోపిడీకి సహకరి స్తున్నారని విమర్శిం చారు. పుస్తకాల మాఫియాపై అనుమతులు లేకుండా పాఠశాలలు కళాశాలలు ప్రారం భిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

జూన్ 1,2 తేదీలలో రాష్ట్ర స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నెల్లూరు

ఎఫ్2 బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో జూన్ 1, 2 వ తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు టోర్నీకి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ నగరంలోని తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో ఒక నూతన ఒరవడి ఏర్పడి తమ ప్రతిభా పాటవాలను పెంచుకొనేందుకు ఒక మంచి అవకాశం అన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్న ఎఫ్-2 బ్యాడ్మింటన్ అకాడమీ వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ అభివద్ధికి తమ సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వెంకట్, టోర్నీ నిర్వాహకులు ప్రభు పాల్గొన్నారు.

న్యూట్రీషియన్‌తో ఊబకాయం మాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజలు జీవన విధానం నూతన ఆహార అలవాట్లు వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిడి వల్ల అధికంగా ఊబకాయులు అవుతున్నారని జాగ్రత్తలు పాటించి దాని నుంచి ఉపశమనం పొందాలని న్యూట్రిషన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆత్మకూర్ మున్సిపల్ పరిధిలోని స్వతం సెంటర్లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గురు మోహన్ ఆధ్వర్యంలో శనివారం ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. పట్టణంలోని ఆరోగ్య అభిలాషులందరూ ఉచిత చెకప్ కార్యక్రమంలో పాల్గొని వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పలువురు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు ప్రజలు వ్యాపారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి ఆరోగ్యానికి అవసరమైన సలహాలు, సూచనలు పొందారు. ఆత్మకూరు పట్టణంలో త్వరలో న్యూట్రీషియన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యూట్రీషియన్స్, జర్నలిస్టులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్

పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో పిల్లలను సంరక్షించుకొని విద్యాబుద్ధులు నేర్పించాలని కావలి న్యాయ సేవాసాధికార సంస్థ లోక్ అదాలత్ సభ్యులు ఎం. మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. శనివారం కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆముదాలదిన్నె గిరిజన కాలనీలో "అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం" న్యాయ సేవ అధికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను అక్రమ రవాణా చేసే వారిని యాచకులుగా తయారుచేసిన వారిపై కఠిన చర్యలు ఉన్నాయన్నారు. ఆ చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం ప్రజలందరూ కూడా అవగాహనతో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమానికి మరో అతిథి సీనియర్ న్యాయవాది లీగల్ ఎయిడ్ అడ్వకేట్ ఐ.సాయిప్రసాద్ మాట్లాడుతూ బాల కార్మిక నిషేధ చట్టంపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని బాల బాలికలను పాఠశాలలకు పంపి విద్యా బుద్ధులు నేర్పించాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో మంచి అలవాటులతో సమాజంలో పెంచాలని కోరారు. కార్యక్రమంలో యానాదిసంఘం మహాకూటమి ఉపాధ్యక్షులు జయంపు కనకయ్య, స్థానిక సచివాలయం పంచాయతీ సెక్రెటరీ పి.నరేంద్ర డిజిటల్ అసిస్టెంట్ ఎం. అనూష, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్, వీఆర్వో బాలకోటయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీహరి బాబు, గిరిజన కాలనీ పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

పశుగ్రాసం కొరత లేకుండా చూడాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పశుగ్రాసం కొరత లేకుండా నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ సిబ్బంది ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పశు సంవర్థక శాఖ జెడి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక బిట్ -1 రైతు భరోసా కేంద్రంలో నియోజకవర్గం స్థాయి సహాయ సంచాలకులు వెటర్నరీ వైద్యులు ప్యారా సిబ్బంది తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఉదయగిరి నియోజకవర్గంలో పశుగ్రాసం కొరత లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. పశుగ్రాసం లభ్యత వాటి పెంపకానికి ప్రోత్సాహకం, విత్తనాల పంపిణీ చేసి పాడి రైతులను ఆదుకోవాలన్నారు. పశు వైద్య సేవలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిరాటంకంగా పశువులకు వైద్యం అందించాలన్నారు. జీవీఏ చేపట్టే నేల మరక కార్యక్రమంతో పాటు ప్రభుత్వాలు అందించే ప్రతి పథకాన్ని రైతుకు అందే విధంగా చూడాలని సిబ్బందికి ఆయన సూచనలు, ఆదేశాలు చేశారు. కార్యక్రమంలో కావలి డిప్యూటీ డైరెక్టర్ రమేష్ నాయక్, కందుకూరు డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఉదయగిరి పశు సంవర్థక శాఖ ఏడిఏ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడి మహేశ్వరరెడ్డి

ప్రమాదశాత్తు ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రమాదవశాత్తు కొత్తచెరువులో కాలుజారి ఉపాధి కూలీ మృతిచెందింది. ఈసంఘటన మండలంలోని గొల్లపాళెంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..రోజులాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు బయలుదేరి పట్టణంలోని కొత్తచెరువు సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లింది. పనిచేసే పరిసరాల్లో ఇటీవల కురిసిన వర్షం చెరువులోకి చేరాయి. పనులు చేసే పరిసరాలు దాటిపెట్టిన ప్రాంతం నుంచి వాటిని తీసేందుకు వెళ్లిన వెంకటలక్ష్మి (40) ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మతి చెందింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు, భర్త హోంగార్డు గా దుత్తలూరు మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి సిఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న దృశ్యం


విచారణ చేపడుతున్న పోలీసులు


నీటిని చూపిస్తున్న దృశ్యం

నీటి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి-ఉదయగిరి

నీటి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి అని పట్టణంలో మండల ఈఓపిఆర్‌డి ఎన్.మల్లికార్జున తనిఖీలు చేపట్టారు. శనివారం స్థానిక గండిపాళెం రోడ్డు సమీపంలోని ఎస్‌టి కాలనీలో ఓ ఇంటి బోరు నీరు, సమీపంలోని వాటర్ ట్యాంక్ నీటిని సేకరించి వాటి నాణ్యత ప్రమాణాలను ఈఓపిఆర్‌డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిలోని ఫ్లోరైడ్, నైట్రేట్, వాటి ఆమ్లత్వం వంటి మూలకాల శాతాలు పరిశీలించారు. అనంతరం వాటర్ ట్యాంకులో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ వేయించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేసి ప్రతి గ్రామంలోని ఈ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా, వీరేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహ పాల్గొన్నారు.


భోజన ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

40మంది వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

సి.ఆర్.డబ్ల్యూ.డి.ఎస్. డైరెక్టర్ ఏగూరి జాకబ్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సువేజా నగర్, శివాజా సుబ్బయ్య కాలనీలలో 40 మంది నిరుపేద వృద్ధులకు చీరలు, దుప్పట్లు, భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఏగూరి జయకర్, ప్రవీణ్, సిఆర్‌డబ్ల్యూడిఎస్ సభ్యులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం..

..సమస్యలు లేవనెత్తని సభ్యులు
.. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరు



మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా శనివారం ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఏఈ ఖాదర్ మస్తాన్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీసీ రోడ్లకు రూ.40లక్షలు, ఎన్ఆర్ఇజిఎస్ కింద రూ 60లక్షలు సీసీ రోడ్లకు మంజూరయ్యాయి. దాదాపు పనులు పూర్తయ్యా యన్నారు. పంచాయతీలలో ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన జలజీవన్ మిషన్ పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపి లాండ్స్ కింద 17పనులు మంజూరు కాగా 12 పనులు పూర్తయ్యా యన్నారు. 3 పనులు జరుగుతుండగా, రెండు పనులు ఆగిపోయాయని తెలియజేశారు. ఎనిమిది పనులకు జెడ్‌పి నిధులు మంజూర య్యాయని తెలిపారు. కోడ్ తర్వాత అన్ని పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వైఎస్ఆర్ సుజల పథకం కింద వాటర్ ట్యాంకులను ఎప్పుడు సిద్ధం చేస్తారని ఏపీ కుంట ఎంపీటీసీ హజరత్ రెడ్డి అడుగగా ఐదేళ్ల వరకు కాంట్రాక్టర్ పరిధిలో ఉంటాయన్నారు. కాంట్రా క్టర్‌కు నోటీసులు కూడా పంపామని, గుత్తేదారు అందు బాటులో లేరని పై అధికారులకు తెలియజేశామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం అవుతుందని ఏపీఓ వెంకట నారాయణ అన్నారు. మండలంలో మూడు పంచాయతీల్లో పనులు ఆలస్యమయ్యా యని స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరిస్తే పనులు మొదలు పెడతామని తెలియజేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.300లు ప్రభుత్వం పెంచిందని, నాలుగు గంటలు పని చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కూలీలు పని ప్రదేశంలో ఆరు గంటలకు ఒక ఫొటో, 10 గంటలకు మరో ఫొటో పంపితేనే కూలీలకు నగదు జమవుతుందన్నారు. ఐదు ఎకరాల లోపు రైతులు తవ్వించుకోవడం వల్ల వర్షపు నీరు గుంటలో చేరి భూగర్భ జలాలు పెరుగుతా యన్నారు. సన్న, చిన్న కారు రైతులకు నిమ్మ, మామిడి, సపోటా, మొక్కలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టి ఇళ్లు కట్టుకునే వారికి మస్టర్లు ఇచ్చి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ మండల ప్రజలకు విస్తృతంగా వైద్య సేవ అందిస్తున్నామని తెలియజేశారు. ఫ్యామిలీ ఫిజీషన్ మండల వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతుం దన్నారు. పిసిజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రతి బుధవారమూ నిర్వహిస్తుఎ న్నామని, ముందుగా స్థానిక ప్రజా ప్రతినిధులు వ్యాక్సినేషన్ వేయించుకొని, మీ సహకారంతో అందరూ వేసుకునేందుకు సహకరించాలని కోరారు. కౌంటింగ్‌కు ముందు తర్వాత శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా మండల ప్రజలు సహకరించాలని ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి కోరారు. జూన్ 6వరకు 30పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. మండలం లోని పంచాయతీలలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టడానికి అనుమతులు లేవన్నారు. 67,565, జాతీయ రహదారుల పై రోడ్డు ప్రమాదాలు ఎక్కు వయ్యా యన్నారు. రహదారి వెంట ఉన్న గ్రామాలలోని గేదెల యజమానులు తమ గేదెలను విచ్చలవిడిగా రోడ్లపైకి వదల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో గేదెల యజమానులకు అవగాహన కల్పిం చామని పేర్కొన్నారు. గేదెలకు రేడియం స్టిక్కరింగ్ వేయుటకు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారం చాలా అవస ్రమన్నారు. మండల సర్వసభ్య సమావే శానికి పలువురు అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ కుంట సుశీలమ్మ, రమణమ్మ, మండల విద్యాశాఖ అధికారి 2 ధనలక్ష్మి, ఎంపిడిఒ మనోహర్‌రాజు, వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ హౌసింగ్, ఏఈ పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్..టెన్షన్..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మరో పది రోజుల వ్యవధిలో ఓట్ల కౌంటింగ్ (లెక్కింపు) ప్రక్రియ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొనడం సహజం. అంతకుమించి అంటే నరాలు తెగేటంత ఉత్కంఠలో బెట్టింగ్ రాయుళ్ల ఉండడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో గెలుపోటములపై టీడీపీ, వైసీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్య ఇదే పరిస్థితి ఉన్నా ప్రత్యేకించి సర్వేపల్లి నియోజకవర్గంలో నరాలు తెగేటంత ఉత్కంఠ బెట్టింగ్ రాయుళ్లలో నెలకొంది. అందుకు రాజకీయ బద్ధ వైరు లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిల మధ్య పోటాపోటీగా పోరు నెలకొనడమే కారణం. జూన్ 4న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కౌంటింగ్ రోజు కోసం వైసీపీ, టీడీపీ కార్యకర్తలు, అభ్యర్థులు ఎంతో టెన్షన్‌తో, ఆసక్తిగా ఎదురు చూస్తున్నారంటే అతి శయోక్తి కాదు. బెట్టింగుల్లో భారీ మొత్తంలో పందెం కాసిన వారిలో నరాలు తెగే టెన్షన్ నెలకొంది. ఇక్కడ విచిత్రం ఏమిటంటే బెట్టింగుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందనో, లేదా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో మారు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనో రాష్ట్ర వ్యాప్తంగా పందేలు కాస్తుంటే, సర్వేపల్లి నియోజకవ ర్గంలో మాత్రం మంత్రి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి చంద్ర మోహన్ రెడ్డిల గెలుపోటములపై బెట్టింగ్ లు పెడుతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో లక్షకు రెండు లక్షలు, రెండు లక్షలకు నాలుగు లక్షలు, ఐదు లక్షలకు పది లక్షల రూపాయల వంతున సోమిరెడ్డి, కాకాణి గెలు పోట ములపై లక్షల్లో బెట్టింగ్‌లు కాస్తుండడం విశేషం. కొందరు వ్యక్తిగతంగా కాస్తుంటే, మరికొందరు గ్రూప్‌గా కూడి బెట్టింగ్ లు పెడుతుండడం గమనార్హం. కౌంటింగ్ ప్రక్రియకు ఇక కేవలం పది రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో బెట్టింగ్ రాయుళ్ల అడ్డదారుల్లో డబ్బు సంపా దించాలనే అత్యాశతో భారీ మొత్తంలో బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్ల ఓటరు ఇచ్చిన తీర్పుపై ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. జూన్ 4వ తేదీ ఫలితాలు వెలువడే వరకు అందరికీ ఈ టెన్షన్ తప్పదు మరి. ఏదేమైనా ఓట్ల లెక్కింపు ప్రక్రియ తేదీ సమీపిస్తున్న కొద్ది ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న అంశంపై కాకుండా కేవలం మాజీ మంత్రి సోమిరెడ్డి, మంత్రి కాకాణిల గెలుపోటములపై పందేలు కట్టడం గమనార్హం.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 375 మంది హాజరు

పజాశక్తి-ఆత్మకూరు అర్బన్:పట్టణం లోని జరగనున్న రెండవ రోజు సప్లమెం టరీ పరీక్షలు శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిఎస్ఆర్ కళాశాలలో సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో జరిగిన మొదటి సంవత్సరం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 253 మంది గాను 13 మంది గైర్హాజరు కాగా 240 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీవాణి తెలిపారు. అదే క్రమంలో రెండో పరీక్ష కేంద్రమైన బిఎస్ఆర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 151 మందికి గాను 16 మంది గైర్హాజరయ్యారు. 135 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు ద్వితీయ సంవత్సరం సంవత్సరం ఇంటర్ సప్లి మెంటరీ పరీక్షలకు 25 మందికి గాను ముగ్గురు గైర్హాజరు కాగా 22 మంది హాజరైనట్లు తెలిపారు.

గెలుపు మాది..కాదు మాది..

ప్రజాశక్తి-నెల్లూరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం.. ఈవిఎంలను స్ట్రాంగ్ రూములలో భద్రపరిచింది. పోస్టల్ బ్యాలెట్లు సైతం పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంలకు తరలించారు. 24 గంటలకో సారి స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటు చేసి భారీ భద్రతల నడుమ లెక్కింపు ఎప్పుడు పూర్తవుతుందా అని జిల్లా అధికార యంత్రాంగం కంటిమీద కునుకు లేకుండా దిన దిన గండం నూరేళ్ల అయుష్షు అన్న చందంగా రోజులు గడుపుతుంది. రాజకీయ నాయకులు, కార్యకర్తలు మాత్రం ప్రజలు తమ పార్టీని ఆదరించారని ఒక పార్టీ .. తాము ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశామని, ఈ నేపథ్యంలో తిరిగి తమ పార్టీకే పట్టం కడతారని గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి కొంత మంది తమ పార్టీ రాష్ట్రంలో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, తమ పార్టీకి చెందిన అభ్యర్థి అత్యధిక మోజార్టీ సాధిస్తారంటూ వేలాది రూపాయలు బెట్టింగ్‌లు చేస్తూ రోజులు లెక్కబెడుతున్నారు. పార్టీనాయకులు, కార్యకర్తలు, ఆయా పార్టీల అభిమానులు ఇలా లెక్కలు వేస్తుంటే పోలీసు అధికారులు మాత్రం జిల్లాలో కౌంటింగ్ సమయంలో ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా శాంతి భద్రతలు పరిరక్షిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు. అదే సమయంలో పోలీసు అధికారులు ఒక అడుగు ముందుకు వేసి కార్డన్ సెర్చ్ కార్యక్రమం పేరుతో అనుమానం వచ్చిన ప్రాంతాలను తనిఖీల పేరుతో జల్లెడ పడుతున్నారు. ఈ తనిఖీలు చేసే సమయంలో సరైన పత్రాలు లేని బైకులు, ఆటోలు, అనుమానిత వ్యక్తులు, నేరాలకు పాల్పడి పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నామంటూ ప్రకటనలు చేస్తున్నారు.

కర్ణాటక రాష్ట్రం బెంగళూరు ప్రాంతంలో సినీ ప్రముఖులు, వ్యాపారస్తులు, మరి కొంత మంది బడా వ్యక్తులు రహస్యంగా నిర్వహిస్తున్న రేవ్ పార్టీలో జిల్లా మంత్రికి చెందిన కారు ఆ ప్రాంతంలో ఉన్నట్లుగా సోషల్ మీడియాలో కథనాలు చక్కర్లు కొట్టాయి. ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ నగరంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తప్పకుండా ఏర్పాటు చేస్తుందని, బిజెపి పని అయిపోయిందని, తప్పకుండా ప్రజా క్షేత్రంలో ఓడిపోయి ఇంటిపయనం పడుతుందంటూ ప్రకటన చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయితే కాని ఎవరి లెక్కలు నిజం అవుతాయో వేచి చూద్దాం మరి.

వీక్షణం

హంస నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) సర్వసభ్య సమావేశం శనివారం టౌన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి హంస రాష్ట్ర అధ్యక్షులు అరవ పాల్ అధ్యక్షత వహించారు. సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఎపి హంస జిల్లా నూతన కార్యవర్గం జిల్లా ప్రెసిడెంట్‌గా చేజర్ల సుధాకర్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీగా బి.కమల్ కిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా కప్పా నారాయణరాజు, జిల్లా ట్రెజరర్‌గా ఎస్.డి. మజాహర్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కె. జలీల్ అహ్మద్, పబ్లిసిటీ సెక్రటరీగా. శేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్స్‌లుగా వి. మురళీకృష్ణ , కె. సహనా,బి. నాగరాజమ్మ ,టి. రాజయ్య ,సి. నాగరాజు, వుమెన్ సెక్రటరీ - బి.సుకన్య , జాయింట్ సెక్రెటరీలు సిహెచ్ హరిప్రసాద్ ,టి.వి ఉషారాణి ,కెవి. మహేష్ బాబు ,జి. ఉమా మహేశ్వర్ ,వి.చాముండేశ్వరి పలువురు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ ను ఎలక్షన్ ప్రొసీజర్ లో ఎన్నికైనట్లు ప్రకటించారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని నార్త్ రాజుపాలెం సెక్టర్ పరిధిలోని బొడ్డు వారి పాలెం లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళ మహోత్సవంలో భాగంగా బాలికల వ్యక్తి గత పరిశుభ్రత పై శనివారం అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ రుతుక్రమం పై ఉన్న అపోహాలు .నిషేధాలు .ఆరోగ్యం పరిశుభ్రత సమయాల్లో వినియోగించాల్సిన ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు రుతుక్రమ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్ర తలపై రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కరప త్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీలు,. తల్లులు, .బాలికలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇఒ

28 నుంచి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఇఒ గిరి కృష్ణ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బ్రహ్మోత్స వాలకు భారీ ఏర్పాట్లు చేయడం లేదని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని బ్రహ్మో త్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధమవు తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. భక్తులు విచ్చేసి స్వామి అమ్మ వారి ఆశీస్సులు పొందాలని కోరారు.



పూర్తయి ఐదేళ్లు కావస్తున్నా.. ప్రారంభానికి నోచని అతిథి గృహం

- ఇప్పటివరకు రూ.90 లక్షల నిధులు ఖర్చు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పలు అభివృద్ధి భవనాలు ప్రారంభిస్తే వాటిలో తీవ్ర జాప్యం జరగడం. నిర్మించిన వాటిని సక్రమంగా వినియోగించు కోకపోవడం ఆత్మకూరులో పరిపాటిగా మారింది. అందుకు నిదర్శనంగా నిలువెత్తు సాక్ష్యంగా ఆత్మకూరు పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఆహ్లాదకరంగా ఉంటుందని ఆర్‌అండ్‌బి అతిథి గృహాన్ని గత పది సంవత్సరాల క్రితం ఈ అతిథి గహాన్ని నిర్మించడం జరిగింది. ఇప్పటివరకు దాదాపు 90 లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. గత 12 ఏళ్ల నుంచి ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మలాగా ఆత్మకూరు ప్రజలను వెక్కిరిస్తూ దర్శనమిస్తుంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆత్మకూరులో ఒక అతిథి గృహం కోసం నిధులు మంజూరు చేసి 12 సంవత్సరాలైనా ఇంకా పూర్తి కాకపోవడం గమనార్హం. ఆత్మకూరులో ఆర్‌డిఒ, తహశీల్దార్, సబ్ ట్రెజరీ, మున్సిపల్ కార్యాలయం తదితర భవనాలు 2012లోనే మంజూ రయ్యాయి. 2014లో ప్రారంభమైన ప్రారంభోత్సవాలు మాత్రం ఆగి పోయాయి. మున్సిపల్ కార్యాలయ భవనం మాత్రం పూర్తిచేసుకుని అక్కడికి కార్యాలయం తరలించారు. ట్రెజరీ కార్యాలయం మాత్రం భవనాన్ని పూర్తిచేసుకుని నూతన భవనంలోకి చేరి పరిపాలన సాగిస్తున్నారు. ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాలు నేటికీ పూర్తి కాకపోవడంతో పట్టణ ప్రజలు ఈ భవనాలు పూర్తి ఎప్పుడు అవుతాయోనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-కోవూరు

ఎన్నికల ఫలితాల రోజు గ్రామంలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బుచ్చి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హైమా రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన బుచ్చిరెడ్డిపాలెం మండలం, జొన్నవాడ గ్రామంలో ఆర్ఐ విద్యాసాగర్ తో కలిసి గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు పాల్పడవద్దని తెలిపారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోని రాజకీయ నాయకులు తమకు సహకరించాలని కోరారు.


భోజన ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి


కావలి పట్టణం వెంగళరావు నగర్ నివాసులు కీ.శే.రంగిడి నాగేశ్వరరావు (రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్) మొదటి వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు - కోడలు, నాగరాజు -రేఖమనవరాలు సాయి శ్రియల సహకారంతో శనివారం సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో 50 మంది పేద పిల్లలకు చికెన్ బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పల్లపు. చిట్టిబాబు , గంధం ప్రసన్నాంజ నేయులు కార్యక్రమ దాతలు రంగడి.నాగరాజు- రేఖ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈసందర్భంగా పల్లపు.చిట్టిబాబు,గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. విశ్రాంత ఎస్.ఐ. నాగేశ్వరరావు ఉద్యోగంలో ఉన్నప్పుడు అందరితో కలిసి మెలిసి ఉండేవారని తెలిపారు. నేడు నాగేశ్వరరావు మన మధ్యలేక పోవడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని తెలిపారు. నేటి దాతలను అభినందించారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బిట్రగుంట

.బోగోలు మండలం నాగుల వరం గ్రామంలో వెలిసి ఉన్న నాగ మల్లేశ్వర స్వామి అమ్మ వార్ల ఆలయం లో మాజీ సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కండ్ల గుంట.మధు బాబు నాయుడు సౌజన్య దంపతులు నవ గ్రహ ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.కార్యక్రమం లో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కావలి.

కావలి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పాతూరు సెల్ టవర్ సమీపంలో శనివారం ఓ గుర్తు తెలియని భిక్షగాడు (63) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు రెండ్రోజులుగా అక్కడే ఉంటూ, స్థానికులు అన్నం పెడితే తింటూ గడి పాడు. సదరు మృత దేహం గురించి ఆచూకీ తెలిసినవారు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఒకటో పట్టణ సిఐ. రాజేష్ తెలిపారు.

In the Court of the 1st Addl. District Judge : Nellore
A.S.No. 86 / 2022

Gadamsetty Lalitha - Appellant
Vs
1. **Kopparapu Narasimha Rao** (Died) and 13 others - Respondents

Notice

To,
R2. Kopparapu Subba Rao, S/o **Satyanarayana Setty,** Properties, R/o. 5-1-253, Stonehousepet, Nellore.
R3. Kopparapu Radha Krishna, S/o **Satyanarayana Setty,** Properties, R/o. 5-1-253, Stonehousepet, Nellore.
R6. Gunupudi Sailaja, W/o Late **G.Venkata Durga Rao,** House Wife, R/o. D.No. 76-10-10/4, Near C.P.I., Office, Bhavanipuram, Vijayawada.
R9. Sriram Satyanarayana, S/o Late Peraiah, Properties, R/o 25/839, Savitri Nagar, Dargamitta, Nellore-524003.
R10. Yelchuri Nadamuni, Father's Name not known, retired employee, R/o C/o. Y. Sudarsan, IDBI Bank Ltd., Menon Pitston Compound, Pune-Bangalore Roadm Shiroli, TOAP, Kolahapur - 416 122.
R11. Yelchuri Sudarsan, S/o **Nadamuni,** C/o. IDBI Bank Ltd., Menon Pitston Compound, Pune-Bangalore Roadm Shiroli, TOAP, Kolahapur - 416 122.
R12. Manchikanti Venkata Subba Rao, father's name not known, Business, R/o 16-3-218, Madhyapathi Vari Veedhi, Nellore - 524001.
R13. Manchikanti Adilakshmi @ Saranya, D/o **Manchikanti Venkata Subba Rao,** properties, R/o 16-3-218, Madhyapathi Vari Veedhi,Nellore- 524001.
R14. Kopparapu Usha Lakshmi, W/o Late **Nageswara Rao,** C/o Usha Sarees, D.No.27-3-692, 16th Cross Road, Balaji Nagar, Nellore-524002.

పై నెంబరు కేసులో అప్పిలెంట్ మీ మీద పై వారి కోర్టులో అప్పీలు దాఖలు చేసియున్నారు. సదరు అప్పీలులో మీకు నోటీసు నిమిత్తం **తే21-6-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జి.కిరణ్ కుమార్, బి.కాం., బి.ఎల్.,
అప్పిలెంట్ తరపు న్యాయవాది, నెల్లూరు.
సెల్: **96037 46347**